సాక్షి ఖమ్మం

గురువారం । 16 । జనవరి । 2025



మార్కెట్‌లో మంటలు

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన అగ్నిప్రమాదంతో వ్యాపారులు నిల్వ చేసిన 1,100 బస్తాల పత్తి కాలి బూడిదైంది. 8లో



నల్లతామర నివారణ ఇలా..

మిర్చి పంటను ఆశిస్తున్న నల్లతామర పురుగు నివారణ చర్యలపై శాస్త్రవేత్తలు, అధికారులు రైతులకు సూచనలు చేశారు. 8లో

గరిష్టం / కనిష్టం
31° / 18°

వాతావరణం

జిల్లాలో గురువారం మధ్యాహ్నం ఉష్ణోగ్రత పెరిగే అవకాశముంది. తెల్లవారుజామున, రాత్రి మాత్రం చలి గాలుల తీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రభుత్వ స్థలంలో ప్రహరీ నిర్మాణం ?



వివాదాస్పద స్థలాన్ని పరిశీలిస్తున్న ఉద్యోగులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని ప్రభుత్వ స్థలంలో నిర్మాణం చేపట్టారనే ఫిర్యాదుతో ఖమ్మం అర్బన్ ఆర్‌ఐ వహీద్ బుధవారం పనులను అడ్డుకున్నారు. గతంలో డీఎస్పీ కార్యాలయ నిర్మాణానికి ఈ స్థలాన్ని కేటాయించిన అత్యంత విలువైన స్థలంలో ప్రైవేట్ వ్యక్తులు పనులు చేపట్టడం వివాదాస్పదమైంది. ఖమ్మం సరిత క్లినిక్ సెంటర్‌లో బుర్హాపురం సర్వే నంబర్ 105లోకి వచ్చే 400 గజాల స్థలాన్ని గతంలో డీఎస్పీ కార్యాలయ నిర్మాణానికి కొన్నేళ్ల క్రితం కేటాయించారు. ఆతర్వాత నిర్మాణం జరగక పోగా, స్థలం తమదేనని కొందరు కోర్టును ఆశ్రయించినా కేసు కొట్టేసినట్లు తెలిసింది. అప్పటి నుంచి ఖాళీగా ఉండడంతో సంక్రాంతి సెలవుల నేపథ్యాన ఓ నాయకుడు సిమెంట్ ప్రహరీ నిర్మించాడు. ఈ విషయమై ఫిర్యాదు అందడంతో ఆర్‌ఐ వహీద్ అక్కడకు వెళ్లి వివరాలు ఆరాతీయగా సదరు నాయకుడు సాయంత్రం తహసీల్‌కు వెళ్లి పత్రాలు సమర్పించాడు. వీటి ఆధారంగా నిర్మాణం స్థలం సర్వే నంబర్ 114లో, ప్రభుత్వ భూమి సర్వేనంబర్ 105లో తేల్చినట్లు సమాచారం. అయితే, పూర్తిస్థాయిలో నిర్ధారించే వరకు నిర్మాణ పనులు చేపట్టొద్దని ఆర్‌ఐ సూచించగా, కేఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారి సతీష్ సైతం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

స్వగ్రామంలో మంత్రి తుమ్మల



గండుగులపల్లిలో పర్యటిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


దమ్మపేట: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు సంక్రాంతి సందర్భంగా మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి స్వగ్రామమైన దమ్మపేట మండలంలోని గండుగులపల్లిలో గడిపారు. మకర సంక్రాంతిని పురస్కరించుకుని ఇంట్లో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం తన నివాసానికి వచ్చిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఆతర్వాత గ్రామంలో కలియతిరుగుతూ బంధువులు, మిత్రుల ఇళ్లకు వెళ్లి పలకరించారు. మాజీ జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు కాసాని నాగప్రసాద్, తుమ్మల శేషుబాబు, కొయ్యల అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. రామయ్య నిత్యకల్యాణం



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్య కల్యాణ వేడుకను బుధవారం నేత్రపర్వంగా నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ వేడుకను శాస్త్రోక్తంగా గావించారు. భక్తులు భారీగా హాజరై స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



తల్లాడలో ఓ ఇంటి ముందు వేసిన ముగ్గు

సంబురంగా సంక్రాంతి



ఖమ్మం వెలుగుమట్ల పార్క్‌లో జరిగిన సంక్రాంతి సంబరాల్లో సీపీ సునీల్‌దత్, డీఎఫ్‌ఓ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్

ఇంటికి చేరిన కొత్త పంటలు.. ఊరూవాడ బంధుమిత్రుల హడావుడి.. వాకిళ్ల ముందు రంగవల్లులు.. తోడు హరిదాసులు, డూడూ బసవన్నలతో వచ్చే వారి సందడి.. గాలిపటాలు ఎగురవేస్తూ గడిపిన చిన్నారులు వెరసి సంక్రాంతి పర్వదినాన్ని జిల్లావాసులు మూడు రోజుల పాటు సంబురంగా జరుపుకున్నారు. పల్లె, పట్టణం తేడా లేకుండా ఎక్కడ చూసినా పండుగ వాతావరణమే కనిపించింది. అంతేకాక ధనుర్మాస పూజలు, గోదారంగనాథస్వామి వార్ల కల్యాణంతో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. కనుమ పండుగ సందర్భంగా బుధవారం పశువులకు ప్రత్యేక పూజలు చేసిన రైతులు.. పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని ఆకాంక్షించారు. – సాక్షి నెట్‌వర్క్



సత్తుపల్లిలో చిన్నారులను ఆశీర్వదిస్తున్న హరిదాసు

కృష్ణా, గోదావరి సంగమం

‘సీతారామ’లో భాగంగా పరీవాహకాలను కలిపేలా పాలేరు టన్నెల్

- 8.2 కి.మీ. నిడివి, 9.5 మీటర్ల వ్యాసార్థంతో తవ్వకం
- పనుల్లో స్వీడన్ డ్రిల్లింగ్ యంత్రాల వినియోగం
- ఎస్‌ఎల్‌బీసీ, కాళేశ్వరం టన్నెళ్లకు మించి అధునాతన యంత్రాలు

కృష్ణా, గోదావరి నదుల పరీవాహకాలను కలిపే వారధిగా పాలేరు టన్నెల్ నిలవనుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు నియోజకవర్గాలకు సాగు నీరు అందించేందుకు నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్టులో భాగంగా కృష్ణా బేసిన్‌లోని పాలేరు రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలను తరలించేలా ఈ టన్నెల్ నిర్మాణమవుతోంది. రైతుల నుంచి భూమి ఎక్కువ సేకరించకుండానే పాలేరు రిజర్వాయర్‌లోకి నీళ్లు చేర్చేలా చేపట్టిన ఈ టన్నెల్ ఎస్‌ఎల్‌బీసీ, కాళేశ్వరం ప్రాజెక్టుల తర్వాత స్థానంలో నిలవనుంది. గతంలో టన్నెళ్ల నిర్మాణానికి చైనా, ఇతర దేశాల బోరింగ్ యంత్రాలను ఉపయోగిస్తే ఇక్కడ మాత్రం స్వీడన్ నుంచి తెప్పించిన అధునాతమైన నాలుగు డ్రిల్లింగ్ మిషన్లను వాడుతుండడంతో పనులు చకచకా సాగుతున్నాయి.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం



టన్నెల్‌లో డ్రిల్లింగ్ చేస్తున్న యంత్రం



దమ్మాయిగూడెం నుంచి పోచారం వరకు నిర్మాణంలో ఉన్న టన్నెల్

ఎన్నెస్పీ ఆయకట్టుకు జీవం

నాగార్జునసాగర్ ప్రాజెక్టు(ఎన్నెస్పీ) రెండో జోన్ పరిధి కింద ఖమ్మం జిల్లాలో 2.54 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. కృష్ణా నది ఎగువన వర్షాలు పడి ప్రాజెక్టులు నిండితేనే సాగర్ జలకళ సంతరించుకుని ఆపై జిల్లాకు నీరు అందుతోంది. అయితే, కృష్ణా పరీవాహకం కంటే ముందే గోదావరి పరీవాహకాన్ని నైరుతి రుతుపవనాలు తాకుతుండగా మహారాష్ట్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌ల్లో భారీ వర్షాలు నమోదై ఏటా జూలై నుంచే గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ సమయానికి కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులు వట్టిపోయి పలుమార్లు వానాకాలం, యాసంగి సీజన్లలో సాగునీరు ఇవ్వలేని పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యాన గత ప్రభుత్వం జీవనదిలా నిత్యం కళకళలాడే గోదావరి జలాలతో ఎన్నెస్పీ ఆయకట్టు స్థిరీకరణకు సీతారామ ప్రాజెక్టును నిర్మించాలని నిర్ణయించింది. ఈ క్రమాన రెండు నదుల పరీవాహకాలను కలిపేలా సీతారామ ప్రధాన కాల్వకు అనుసంధానంగా పాలేరు లింక్ కెనాల్‌ను ఏన్కూరు వద్ద నిర్మిస్తున్నారు.

రోజుకు 28 మీటర్లు..

సీతారామ ప్రాజెక్టులో భాగంగా 62.7వ కి.మీ. నుంచి 76.9 కి.మీ. వరకు పనులను 16వ ప్యాకేజీ కింద చేపట్టగా ఇందులోనే కాల్వ, టన్నెల్ నిర్మాణానికి సిద్ధమయ్యారు. తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడెం నుంచి కూసుమంచి మండలం పోచారం వరకు 8.2 కి.మీ. మేర టన్నెల్ ఉండగా మిగతా 4.5 కి.మీ. మేర కాల్వ ఉంటుంది. ఈ పనులను 2023 ఆగస్టులోనే మొదలుపెట్టినా గత ఏడాది వరదల నేపథ్యాన ముందుకు సాగలేదు. ఇటీవలే పనుల్లో వేగం పుంజుకోవడంతో టన్నెల్ తవ్వకం 2.9 కి.మీ. మేర పూర్తయింది. మొత్తంగా నిర్మాణాన్ని ఈ ఏడాది డిసెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం స్వీడన్ నుంచి రూ.4.5 కోట్ల విలువైన నాలుగు డ్రిల్లింగ్ మిషన్లు తెప్పించిన కాంట్రాక్టు సంస్థ 380 మంది కార్మికులతో మూడు షిఫ్టుల్లో పని చేయిస్తోంది. తొలుత బీరోలు వద్ద కొంతమేర తవ్వి అక్కడి నుంచి ఎడమ, కుడివైపులా రెండు డ్రిల్లింగ్ మిషన్లు, ఇన్‌లెట్, ఔట్ లెట్ నుంచి మరో రెండు మిషన్లు.. మొత్తంగా నాలుగు మిషన్లతో రోజుకు 28 మీటర్ల మేర తవ్వకం చేపడుతున్నారు.



తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడెం వద్ద పాలేరు టన్నెల్ ఇన్‌లెట్

మల్టీపర్పస్‌లా పాలేరు టన్నెల్..

పాలేరు టన్నెల్‌ను భవిష్యత్‌లో మల్టీ పర్పస్‌గా ఉపయోగించుకునేలా నిర్ణయించారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను మోటార్లతో ఎత్తిపోసేలా డిజైన్ చేశారు. భవిష్యత్‌లో మోటర్లలో సమస్య ఏర్పడితే పాలేరు రిజర్వాయర్‌కు గోదావరి జలాలు చేరడం కష్టమే. దీన్ని గుర్తించిన ప్రభుత్వం ఇటీవల మున్నేరు నీటిని పాలేరు రిజర్వాయర్‌కి చేర్చేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించింది. దీనిపై రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టి సారించడంతో తాజాగా అధికారులు డీపీఆర్ సమర్పించారు. మహబూబాబాద్ జిల్లాలోని డోర్నకల్ దిగువ భాగాన పాకాల, బయ్యారం అలుగుల ద్వారా ప్రవాహం మున్నేరులో కలుస్తోంది. ఈ నీటిని కాల్వ ద్వారా సమీపంలోని పాలేరు లింక్ కెనాల్‌లోకి చేరిస్తే టన్నెల్ ద్వారా పాలేరు రిజర్వాయర్‌లోకి వస్తాయి. ఫలితంగా కృష్ణా బేసిన్‌లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడినా, గోదావరి జలాలను సీతారామ పంపులతో ఎత్తిపోయలేని పరిస్థితులు ఎదురైనప్పటికీ మున్నేరు నీటితో పాలేరు జలకళ సంతరించుకుని ఆయకట్టుకు నీళ్లు ఇచ్చే క్రతువులో టన్నెల్ కీలకంగా మారనుంది.

రైతులు భూమి కోల్పోకుండా..

పాలేరుకు గోదావరి జలాలు చేరవేసేందుకు కాల్వ నిర్మాణానికి తొలుత సిద్ధమైనా తిరుమలాయపాలెం, కూసుమంచి మండలాల్లో 830 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంటుందని ప్రతిపాదనల్లో పొందుపర్చారు. ఇందుకోసం రైతుల భూములే ఎక్కువగా ఉండడంతో అటు భూసేకరణ, ఇటు పరిహారం భారం తగ్గేలా టన్నెల్‌కే మొగ్గుచూపారు. దీంతో 521 ఎకరాల భూసేకరణ అవసరం లేదని తేల్చి, మిగతా 309 ఎకరాలు సేకరించి రైతులకు పరిహారం అందజేశారు. భూసేకరణ తగ్గడంతో తిరుమలాయపాలెం మండలంలోని దమ్మాయిగూడెం, బీరోలు, తాళ్లచెరువు, మేడిదపల్లి, పాతర్లపాడు, కూసుమంచి మండలంలోని పోచారం గ్రామ రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

ఇదీ టన్నెల్ నేపథ్యం

సీతారామ ప్రాజెక్టు ప్యాకేజీ	ఎక్కడి నుంచి ఎక్కడి వరకు	పూర్తి నిడివి	ఇప్పటివరకు పూర్తి	వ్యాసార్థం	నీటి తరలింపు సామర్థ్యం	అంచనా వ్యయం
16	తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడెం నుంచి కూసుమంచి మండలం పోచారం వరకు..	8.2 కి.మీ.	2.9 కి.మీ.	9.5 మీటర్లు	4,500 క్యూసెక్కులు	రూ.460 కోట్లు

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

- నేటి నుంచి 18వరకు సర్వే, ఆపై గ్రామసభలు
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పక్కన అదనపు కలెక్టర్ శ్రీజ, అధికారులు

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26నుండి నాలుగు సంక్షేమ పథకాలను అమలుచేయనున్న నేపథ్యాన లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా పూర్తి చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం సర్వే, లబ్ధిదారుల ఎంపిక, గ్రామసభల నిర్వహణపై అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి లబ్ధిదారుల ఎంపికకు ప్రభుత్వం విధివిధానాలు జారీ చేసిందని తెలిపారు. ఈమేరకు అధికారులు స్పష్టమైన అవగాహన కలిగి ఉండడమే కాక లబ్ధిదారుల ఎంపిక నిరంతరం కొనసాగుతుందనే అంశాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. అర్హులకు పథకాలు మంజూరు ఎంత ముఖ్యమో, అనర్హులెవరికీ లబ్ధి జరగకుండా చూడడం కూడా ప్రధానమని తెలిపారు. రైతు భరోసా కింద వ్యవసాయ యోగ్యమైన భూమి ఎకరాకు ఏటా రూ.12 వేలు ఇవ్వనున్నందున వ్యవసాయ యోగ్యం కాని భూములను గుర్తించాలన్నారు. ఇందుకోసం గ్రామాల వారీగా పాస్‌బుక్‌లను విభజించి ఆర్‌ఐ, ఏఈఓలు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేశాక నివేదిక సమర్పించాలని కలెక్టర్ సూచించారు. అలాగే, ఆత్మీయ భరోసాకు సంబంధించి భూమి లేని వారు, గత ఏడాది కనీసం 20 రోజుల ఉపాధి హామీ పని చేసిన వారిని అర్హులుగా గుర్తించాలని తెలిపారు.

నేటి నుంచి సర్వే

నాలుగు పథకాలకు లబ్ధిదారుల ఎంపిక కోసం గురువారం నుంచి సర్వే ప్రారంభించి ఈనెల 18వ తేదీలోగా పూర్తిచేయాలని కలెక్టర్ సూచించారు. ఆపై 20వ తేదీ నుంచి గ్రామసభలు మొదలుపెట్టి జాబితాను ప్రదర్శించాలని తెలిపారు. ప్రతీ గ్రామసభను వీడియో చిత్రీకరించాలని, రైతు భరోసా, ఆత్మీయ భరోసా జాబితాలపై ఈనెల 21, 22 తేదీల్లో తహసీల్దార్, మండల వ్యవసాయ అధికారులు మరోమారు పరిశీలించాలని సూచించారు. అలాగే, కొత్త రేషన్ కార్డుల జారీ విషయంలో మండల స్థాయిలో ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లు, జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్, జిల్లా పౌరసరఫరాల అధికారి ధ్రువీకరించాల్సి ఉంటుందని తెలిపారు. కాగా, ఇందిరమ్మ ఇళ్ల సర్వే ముగింపు దశకు వచ్చినందున మొదటి విడతలో నిరుపేదలకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో డీఆర్డీఓ సన్యాసయ్య, డీపీఓ ఆశాలత, డీఎస్‌ఓ చందన్ కుమార్, డీఏఓ పుల్లయ్య, హౌసింగ్ పీడీ బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తకార్డుల జారీకి మోక్షం

- జిల్లాలో ప్రస్తుతం 37,152 దరఖాస్తులు పెండింగ్
- నేటి నుంచి క్షేత్రస్థాయి పరిశీలన

ఖమ్మం సహకారనగర్: అర్హులైన లబ్ధిదారులకు ఇకపై కొత్త రేషన్‌కార్డులు అందనున్నాయి. ఏళ్ల తరబడి దరఖాస్తు చేసుకుని ఎదురుచూస్తున్న వారి కల ఎట్టకేలకు ఫలించనుంది. కొద్దినెలల క్రితం నిర్వహించిన ప్రజాపాలన సభల్లో రేషన్ కార్డుల కోసం కూడా దరఖాస్తులు స్వీకరించారు. తాజాగా జరిగిన ఇంటింటా కులగణన సర్వేలోనూ రేషన్‌కార్డుల లేని వారి వివరాలు సేకరించారు. ఇంతలోనే ఈనెల 26వ తేదీన జారీ ప్రక్రియను ప్రారంభించనున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం మార్గదర్శకాలు సైతం జారీ చేసింది. దీంతో గురువారం నుంచి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు.

ఖమ్మం అర్బన్‌లో అత్యధికం

జిల్లాలోని 21మండలాల పరిధిలో 37,152 కుటుంబాలు రేషన్‌కార్డులు అవసరమని దరఖాస్తులు సమర్పించాయి. ఇందులో అత్యధికంగా ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్(ఖమ్మం అర్బన్) పరిధిలో 5,295దరఖాస్తులు రాగా.. తక్కువగా మధిర మున్సిపాలిటీ పరిధిలో 767దరఖాస్తులు వచ్చాయి. వీటి ఆధారంగా సర్వే చేపట్టి అర్హులకు రేషన్‌కార్డులు జారీ చేస్తామని జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి చందన్‌కుమార్ తెలిపారు.

ఇవీ విధివిధానాలు

మండల స్థాయిలో ఎంపీడీఓ, మున్సిపాలిటీల్లో కమిషనర్ ఆధ్వర్యాన సర్వే నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) / డీసీఓ పర్యవేక్షకులుగా వ్యవహరిస్తారు. సర్వేలో అర్హులుగా గుర్తించిన ముసాయిదా జాబితాలను గ్రామసభ, వార్డు సభలో ప్రదర్శించి చర్చించాక ఆమోదిస్తారు. ఆపై వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి కలెక్టర్‌కు పంపిస్తే అక్కడ ఆమోదం తర్వాత సివిల్ సప్లయిస్ కమిషనర్‌కు చేరుతుంది. అంతరం లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తారు. అయితే, అర్హులైన వ్యక్తి పేరు ఒకే రేషన్ కార్డులో ఉండేలా అధికారులు పర్యవేక్షిస్తారు.

పండుగ వేళ కో‘ఢీ’

- తెలంగాణ – ఏపీ సరిహద్దుల్లో జోరుగా పందేలు
- ఏపీ బాట పట్టిన జిల్లావాసులు
- రూ.లక్షల్లో నగదు కోల్పోయిన పలువురు

సత్తుపల్లి: సంక్రాంతి వేళ పందెంకోళ్లు కత్తులు దూసుకున్నాయి. పండుగ మూడు రోజులు జూదం పురివిప్పింది. పందేలను చూసేందుకు, కాసేందుకు జిల్లా కేంద్రంతో పాటు ఏపీని సరిహద్దుగా ఉన్న సత్తుపల్లి, మధిర, వైరా నియోజకవర్గాల నుంచి పలువురు ఆంధ్రా వైపుకు పరుగులు పెట్టారు. అక్కడి కొన్ని బిర్రుల్లో పూర్తిగా సత్తుపల్లి ప్రాంత వాసులే ఉన్నారని తెలిసింది. అయితే, చాలామంది పందెంలో డబ్బు పోగొట్టుకోగా కొందరు మాత్రం సంతోషంగా బయటకు వచ్చినట్లు సమాచారం.

కోడిపందెం కంటే...

పండుగను పురస్కరించుకుని కోడిపందేల నిర్వహణ ఆనవాయితీగా వస్తోంది. అయితే, పందేల మాటున రూ.లక్షల్లో పేకాట, ఇతర జూదం నడిపించడంతో పలువురు జేబులు గుల్ల చేసుకున్నారు. రాత్రింబవళ్లు తేడా లేకుండా ఫ్లడ్ లైట్ల వెలుగుల్లో జూదం నిర్వహించగా రూ.లక్షల్లో చేతులు మారినట్లు సమాచారం. కొన్నిచోట్ల మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం ఉదయం వరకు పేకాట నడిచినట్లు తెలిసింది. గుండుపట్టాలు, పులిమేక, జూదంలోనూ పలువురు డబ్బు కోల్పోయారని సమాచారం.



ఏపీలోని పందెం బిర్రులో కోడిపుంజులు

సకల సౌకర్యాలు..

బిర్రుల వద్ద నిర్వాహకులు సకల సౌకర్యాలతో జూదరులను ఆకట్టుకున్నారని తెలిసింది. మద్యం, బిర్యానీ సమకూరుస్తూ ఎవరికీ అసౌకర్యం కలగకుండా చూసుకున్నారని చెబుతున్నారు. జిల్లా నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి సైతం పెద్దసంఖ్యలో ఏపీకి వెళ్లడంతో కొన్ని బిర్రుల వద్ద గంటల తరబడి ట్రాఫిక్ సమస్య తలెత్తినట్లు సమాచారం. అయితే, జిల్లాలో మాత్రం కోడిపందేలు, పేకాట, ఇతరత్రా జూదాన్ని నియంత్రించడంలో పోలీసులు విజయవంతమయ్యారనే చెప్పాలి. ఎక్కడికక్కడ నిఘా ఏర్పాటుచేసి తెలంగాణ సరిహద్దుల్లో పందేలు లేకుండా నిలువరించగలిగారు. పాత నిందితులను బైండోవర్ చేయడమే కాక వారి కదలికలను గమనించడంతో ఎక్కడా పందేలా జరిగిన ఆనవాళ్లు కనిపించలేదు.

క్లుప్తంగా

బీటెక్ విద్యార్థికి రూ.1.30 లక్షల ఆర్థికసాయం



సురేందర్‌కు చెక్కు అందిస్తున్న రామారావు

కల్లూరు: ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా విసన్నపేటకు చెందిన సురేందర్ కాకినాడలోని ఆదిత్య యూనివర్సిటీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అయితే, ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఫీజు చెల్లింపునకు ఇబ్బంది పడుతుండగా కల్లూరుకు చెందిన స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధి వరకా రామారావు దృష్టికి సమస్యను తీసుకొచ్చారు. దీంతో ఆయన అమెరికాలో ఉంటున్న కౌశిక్‌కు తెలపడంతో సురేందర్ బీటెక్ పూర్తయ్యే వరకు ఖర్చులు భరిస్తానని ముందుకొచ్చాడు. ఈమేరకు తొలుత రూ.1.30 వేల చెక్కును రామారావు బుధవారం అందజేశారు.

రేకుల షెడ్డుకు రూ.9వేల ఇంటి పన్ను!

కొణిజర్ల: కేవలం రేకులతో ఉన్న ఇంటికి ఏకంగా రూ.9వేల మేర పన్ను విధించిన కొణిజర్ల గ్రామపంచాయతీ సిబ్బంది తీరుపై యజమాని బుధవారం జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన షేక్ నాగుల్ షరీఫ్‌కు గ్రామంలో 144 చదరపు అడుగుల స్థలం ఉండగా అక్కడ గతంలో ఉన్న పూరిల్లు తొలగించి రేకుల షెడ్డు నిర్మించుకున్నాడు. ఈమేరకు ఆన్‌లైన్‌లో అంచనా వేయించగా పన్ను రూ.378గా వచ్చింది. దీంతో ఆయన పన్ను కట్టేందుకు పంచాయతీ కార్యాలయానికి వెళ్తే రూ.8,979 చెల్లించాలని సిబ్బంది చెప్పారు. దీంతో నివ్వెరబోయిన నాగుల్ బుధవారం డీపీఓ ఆశాలతకు ఫిర్యాదు చేశారు. కాగా, ఈ విషయమై పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా తాను కొత్తగా వచ్చానని ఆన్‌లైన్‌లో చూస్తే పన్ను రూ.8వేలకు చూపిస్తోందని తెలిపారు. పూర్తిస్థాయిలో వివరాలు పరిశీలిస్తామని వెల్లడించారు.

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మృతి


గౌరమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కొణిజర్ల: మండలంలోని పెద్దగోపతికి చెందిన సీపీఎం సీనియర్ నాయకురాలు, తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు ఇనుకొండ గౌరమ్మ(98) బుధవారం మృతి చెందింది. కొద్ది రోజులుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతుండగా చికిత్స చేయిస్తుండగానే కన్నుమూసింది. ఆమెకు ఆరుగురు కుమారులు, నలుగురు కూతుళ్లు ఉన్నారు. ఈమేరకు గౌరమ్మ మృతదేహంపై సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. ఖమ్మం తాలూకాలో భర్త నారాయణతో కలిసి గౌరమ్మ పార్టీ నిర్మాణానికి కృషి చేశారని కొనియాడారు. నాయకులు మాదినేని రమేష్, తాళ్లపల్లి కృష్ణ, కుటుంబరావు, బి.శ్రీనివాసరావు, డి.కృష్ణ, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేటలో మిట్టగూడెం వాసి మృతి

అశ్వాపురం: వరంగల్ జిల్లా నర్సంపేటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మండల పరిధిలోని మిట్టగూడెం గ్రామానికి చెందిన కణితి చంద్రమోహన్(65) మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. చంద్రమోహన్ కొంత కాలంగా నర్సంపేట సమీపంలోని మహేశ్వరంలో ఉంటున్నాడు. ఈ నెల 13న నర్సంపేట నుంచి నడుచుకుంటూ మహేశ్వరం వైపు వెళ్తున్నాడు. వెనుక నుంచి బైక్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతదేహాన్ని స్వగ్రామం మిట్టగూడెం తీసుకొచ్చి దహనసంస్కారాలు నిర్వహించారు.

గురుకులం ప్రిన్సిపాల్ సస్పెన్షన్

ఇల్లెందు: ఇల్లెందు మైనారిటీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ భీమనపల్లి కృష్ణపై సస్పెన్షన్ వేటు పడింది. ఇటీవల ఆయన అదే పాఠశాలలో పని చేస్తున్న గెస్ట్ టీచర్ నుంచి రూ.2 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన విషయం విదితమే. దీంతో ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. రెగ్యులర్ టీజీటీ సోషల్ ఉపాధ్యాయుడు రహీంకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. కాగా ప్రిన్సిపాల్ లంచం తీసుకుంటూ పట్టుబడిన ఉదంతంతో ఇన్‌చార్జ్ బాధ్యతలు తీసుకునేందుకు, అక్కడ పని చేసేందుకు అధ్యాపకులు భయపడుతున్నట్లు ప్రచారం సాగుతోంది.

వ్యక్తి అదృశ్యం

ఇల్లెందు: మండలంలోని ముకుందాపురం ఏరియా ఒడ్డుగూడెం గ్రామానికి చెందిన సూరంపల్లి వీరభద్రం(35) ఈ నెల 12న తన సెలూన్‌కు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లాడు. తిరిగి రాలేదు. పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. భార్య సాయిజ్యోతి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ నాగుల్ మీరా పఠాన్‌ఖాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మార్కెట్‌లో చెలరేగిన మంటలు

- వ్యాపారులు నిల్వ చేసిన 1,100 బస్తాల పత్తి ఆహుతి
- రూ.30 లక్షల మేర నష్టం జరిగినట్లు అంచనా
- అగ్నిమాపక శాఖ ఆలస్యంతో పెరిగిన నష్టతీవ్రత
- ప్రమాదానికి కారణాలపై కానరాని స్పష్టత


మార్కెట్‌లో కాలిపోతున్న పత్తి బస్తాలు

ఖమ్మంవ్యవసాయం: రైతుల నుంచి కొనుగోలు చేసిన పత్తిని ఇతర రాష్ట్రాలకు తరలించేందుకు సిద్ధమవుతున్న వ్యాపారులకు కోలుకోలేని నష్టం ఎదురైంది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్ బుధవారం రాత్రి అకస్మాత్తుగా మొదలైన మంటలతో రూ.30లక్షల విలువైన 1,100 బస్తాల పత్తి కాలిబూడిదైంది. ఈ ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమని ప్రాథమికంగా చెబుతున్నా స్పష్టత రావాల్సి ఉంది.

ముగ్గురు వ్యాపారులు.. 1,700 బస్తాలు

సంక్రాంతి పండగ ముందు నుంచి రైతులు తీసుకొచ్చిన పత్తిని వ్యాపారులు కొనుగోలు చేసి షెడ్లలో నిల్వ పెడుతున్నారు. లారీ లోడ్ మేర అయ్యాక ఇతర ప్రాంతాలకు తరలిస్తుంటారు. ఇందులో భాగంగా ప్రస్తుతం 4 వేలకు పైగా బస్తాల పత్తిని షెడ్లలో నిల్వ చేయగా, తమిళనాడుకు తరలించే పనిలో ఉన్నారు. ఈక్రమాన మూడో నంబర్ షెడ్‌లో మణికంఠ కాటన్ ట్రేడర్స్, శ్రీ రామా ట్రేడర్స్ బాధ్యులు 1,100 బస్తాలతో పాటు ఇంకో వ్యాపారి 500 బస్తాల పత్తి నిల్వ చేశారు. ఈక్రమాన బుధవారం రాత్రి మొదలైన మంటలతో ఇద్దరు వ్యాపారులకు చెందిన 1,100 బస్తాల పత్తి పూర్తిగా కాలిపోయింది. ఈమేరకు ఖమ్మం త్రీటౌన్ సీఐ రమేష్ సిబ్బంది చేరుకుని మంటలు అదుపు చేసే ప్రయత్నాలు చేసూకతనే అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అలాగే, ఏసీపీ రమణమూర్తి కూడా చేరుకుని పర్యవేక్షించగా, మార్కెట్‌కు వచ్చిన కార్మికులు కొన్ని పత్తి బస్తాలను బయటకు లాగారు.

షార్ట్ సర్క్యూటా.. మందు బాబులా?

సంక్రాంతి వేళ మార్కెట్‌లో జరిగిన అగ్ని ప్రమాదంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈప్రమాదానికి షార్ట్ సర్క్యూటే కారణమని వ్యాపారవర్గాలు అనుమానిస్తున్నాయి. అయితే, మార్కెట్ గేట్ల వద్ద సెక్యూరిటీ సిబ్బంది ఉన్నప్పటికీ గురువారం నుంచి పంట కొనుగోళ్లు మొదలుకానుండడంతో వ్యాపారులు, గుమస్తాలు, వాచ్‌మెన్లు వచ్చివెళ్తుంటారు. ఇదే సమయాన కొందరు మందుబాబులు వచ్చి ఉండొచ్చని, సిగరెట్లు తాగి ఆర్పకుండా వేయడంతో ప్రమాదం జరిగి ఉండొచ్చని కూడా ఇంకొందరు చెబుతున్నారు. కాగా, ప్రమాద సమాచారం అందడంతో మార్కెట్ నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులు యరగర్ల హన్మంతరావు, తల్లాడ రమేష్ చేరుకుని వివరాలు ఆరా తీశారు.


కాలి బూడిదైన పత్తి

కాస్త ముందొస్తే...

మార్కెట్‌లో అగ్నిప్రమాదం రాత్రి 7గంటలకు జరిగింది. ఆ వెంటనే సమాచారం ఇచ్చినా అగ్నిమాపక శాఖ ఉద్యోగులు ఒకే వాహనంతో 7–45 గంటలకు వచ్చారు. ఆ వాహనంలో మంటలు ఆర్పడంతో సాధ్యం కాకపోవడంతో 8–30 గంటలకు ఇంకో వాహనాన్ని తెప్పించారు. కానీ అప్పటికే ప్రమాద తీవ్రత పెరిగి జరగాల్సిన నష్టం జరిగిపోయింది.

ఏడాదిలో రెండోసారి

ఏడాది వ్యవధిలో ఖమ్మం మార్కెట్‌లోని పత్తి యార్డులోనే రెండుసార్లు అగ్నిప్రమాదాలు జరగడం గమనార్హం. 2023 డిసెంబర్‌లో చిత్తూరు శ్రీనివాస్‌కు చెందిన దాదాపు 1,500 బస్తాల పత్తి అగ్ని ప్రమాదంలో కాలి బూడిదైంది. ఈ ఘటనలో రూ.40 లక్షల మేరకు నష్టం వాటిల్లినట్లు అంచనా. అయితే, సదరు వ్యాపారి బీమా చేయించి ఉండడంతో ఆయనకు రూ.35 లక్షల మేర పరిహారం అందింది. కానీ ప్రస్తుతం అగ్నికి ఆహుతైన పత్తికి బీమా ఉందా, లేదా అనేది తెలియాల్సి ఉంది. కాగా, అగ్ని ప్రమాదంపై రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరా తీశారు. పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌తో పాటు అగ్నిమాపక శాఖ అధికారులతో మాట్లాడి సూచనలు చేశారు. ఘటనపై సమగ్ర నివేదిక అందించాలని ఆదేశించారు.

బీఆర్ఎస్ నేతల పరిశీలన

అగ్నిప్రమాదం జరిగినట్లు తెలియగానే బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి అలీం తదితరులతో మాట్లాడి సహాయక చర్యలపై ఆరా తీశారు. ఆయన వెంట మార్కెట్ మాజీ చైర్మన్ గుండాల కృష్ణ ఉన్నారు.

బస్టాండ్‌కు వెళ్తూ యువకుడి అదృశ్యం

- తనికెళ్ల లాక్‌ల వద్ద లభ్యమైన మృతదేహం
- హత్య చేశారంటూ కుటుంబీకుల ధర్నా


సంజయ్‌కుమార్ (ఫైల్)

ఖమ్మంరూరల్: ఖమ్మంరూరల్ మండలం పోలేపల్లి పరిధి రాజీవ్ గృహకల్పకు చెందిన పందెపు సంజయ్‌కుమార్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అయితే, ఆయనను గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారంటూ కుటుంబీకులు ఆందోళనకు దిగారు. ఓ మహిళను సదరు వ్యక్తులు ఆటోలో తీసుకెళ్తుండగా ఆమె కేకలు వేయడంతో కాపాడే యత్నంలో సంజయ్ హత్యకు గురయ్యాడని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. తన సోదరుడైన జ్ఞానసాయి హైదరాబాద్ నుండి బస్సులో వస్తుండగా ఆయనను తీసుకొచ్చేందుకు ఖమ్మం కొత్త బస్టాండ్‌కు ఈనెల 13న అర్ధరాత్రి ఒంటి గంటకు బైక్‌పై బయలుదేరిన సంజయ్ ఆతర్వాత కానరాకుండా పోయాడు. అప్పటి నుంచి పోలీసులు, కుటుంబీకులు గాలిస్తుండగా 14న మంగళవారం సాయంత్రం తనికెళ్ల సమీపాన సాగర్ కాల్వ లాక్‌ల వద్ద మృతదేహమై కనిపించాడు. దీంతో రాత్రి ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించగా బుధవారం ఉదయం పోస్టుమార్టం చేసి కుటుంబీకులకు అప్పగించారు.

మృతదేహంతో రాస్తారోకో

సంజయ్‌ను నలుగురు యువకులు హత్య చేశారని, నిందితులను అరెస్ట్ చేయాలంటూ ఆయన కుటుంబీకులు మృతదేహంతో కరుణగిరి వద్ద ఖమ్మం – వరంగల్ రహదారిపై రాస్తారోకో చేశారు. అమ్మ చికెన్ సెంటర్ వద్ద ఆటోలో ఓ మహిళ తనను రక్షించండని కేకలు వేయడంతో ఆయన ఆటోను వెంబడించాడని, అందులోని ఆగంతకులు సంజయ్‌ను కొట్టి హత్య చేశారని ఆరోపించారు. ఆ సమయంలో సంజయ్ తన సోదరుడు జ్ఞానసాయికి పంపిన వాయిస్ మెసేజ్‌లో 'అన్నా నన్ను చంపుతున్నారు.. కాపాడు' అంటూ చెప్పాడని దీంతో తాము సంజయ్ చెప్పిన ప్రాంతానికి వెళ్లేసరికి ఎవరూ లేరన్నారు. సంజయ్‌ను కొట్టి హత్య చేసి కాల్వలో పడేశారని, నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి చేరుకుని వారికి నచ్చచెప్పేందుకు యత్నించగా ససేమిరా అన్నారు. ఆ కాసేపటికి మళ్లీ చర్చించిన ఏసీపీ ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని, రహదారిపై బైఠాయించి ఇతరులను ఇబ్బంది పెట్టొద్దని సూచించడంతో వారు రాస్తారోకో విరమించారు. కాగా, సంజయ్‌కు ఇటీవల బెంగుళూరులో ఉద్యోగం వచ్చిందని, సంక్రాంతి తర్వాత వెళ్లే ఏర్పాట్లు చేసుకుంటుండగా ఇలా జరిగిందని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.


రాస్తారోకో చేస్తున్న సంజయ్ కుటుంబీకులు, స్థానికులు

ఆమె ఎవరు?

ఇదిలా ఉండగా ఆటోలో నలుగురు ఆగంతుకులు ఓ మహిళను తీసుకెళ్తుండగా ఆమె కేకలతో సంజయ్ వెండించినట్లు తెలుస్తోంది. ఆపై తనను కొట్టి చంపుతున్నారని, ఆ మహిళను చంపేశారని ఆయన తన సోదరుడికి వాయిస్ మెసేజ్ పంపించాడు. అయితే, ఇప్పటివరకు మహిళ మృతదేహం ఎక్కడా లభించకపోగా, తప్పిపోయినట్లు కూడా పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెబుతున్నారు. దీంతో ఘటనపై మరింత లోతుగా విచారించేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా

సాగర్ కల్వ కట్ట అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందనే విమర్శలు వస్తున్నాయి. రాజీవ్ గృహకల్ప వద్ద గురుదత్త ఫౌండేషన్‌కు సమీపాన కాల్వ కట్ట కేంద్రంగా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని తెలుస్తోంది. చీకటిపడితే చాలు పలువురు యువకులు చేరి మత్తు పదార్థాలు సేవించడం, వారికి వారే ఘర్షణ పడడం పరిపాటిగా మారిందని, వారి అరుపులతో ఈ ప్రాంతం దద్దరిల్లుతోందని స్థానికులు చెబుతున్నారు. దీంతో రాత్రి అయిందంటే పోలేపల్లి, గోళ్లపాడు, పల్లెగూడెం వెళ్లే వారు మార్గాన్ని మార్చుకుంటారని తెలుస్తోంది.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ముగ్గురి వేధింపులే కారణమని ఫిర్యాదు


అప్పారావు (ఫైల్)

ఎర్రుపాలెం: మండలంలోని నర్సింహాపురం గ్రామానికి చెందిన గంతాల అప్పారావు (29) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎర్రుపాలెం రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాంపై ఆయన మంగళవారం తాగి ఆత్మహత్యకు పాల్పడగా జీఆర్పీ ఎస్‌ఐ భాస్కరరావు, మృతుడి భార్య అశ్విని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులోని వివరాలిలా ఉన్నాయి. అప్పారావు తన గ్రామానికే చెందిన శీలం శ్రీనివాసరెడ్డి వద్ద కొంత అప్పు తీసుకుని తీర్చేసినా ఇంకా చెల్లించాల్సి ఉందని శ్రీనివాసరెడ్డి ఒత్తిడి తీసుకొచ్చాడని తెలిసింది. అలాగే, గ్రామానికి చెందిన యరమల శ్రీనివాసరెడ్డి, యరమల జనార్దన్‌రెడ్డి కూడా అప్పారావుపై అప్పు విషయమై ప్రచారం చేయడంతో ఆయన మనస్థాపానికి గురైనట్లు సమాచారం. ఈమేరకు ఆయన మంగళవారం ఎర్రుపాలెం రైల్వేస్టేషన్‌కు వచ్చి పురుగుల మందు తాగడంతో గమనించిన స్థానికులు స్థానిక ఆస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఘటనపై ఆయన భార్య ఫిర్యాదుతో ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భాస్కరరావు తెలిపారు.

దానవాయిగూడెంలో మహిళ..

ఖమ్మంరూరల్: మండలంలోని దానవాయిగూడెంకు చెందిన వివాహిత ఓర్సు లక్ష్మి(33) మంగళవారం ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. కొంత కాలంగా ఆమె జీవితంపై విరక్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యాన మండలంలోని వెంకటగిరి క్రాస్ వద్ద చెట్టుకు ఉరి వేసుకుంది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు చేరుకుని పరిశీలించగా ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ ముష్క రాజు తెలిపారు. కాగా, లక్ష్మికి భర్త పిల్లలు ఉన్నారు.

ఉరి వేసుకుని యువకుడు..

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురానికి చెందిన నామవరపు ఉదయ్(18) బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయాన ఆయన స్లాబ్ రాడ్‌కు ఉరి వేసుకున్నాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లి తలుపు తట్టినా స్పందన లేకపోవడంతో చుట్టుపక్కల వారు వచ్చి పగలగొట్టారు. అప్పటికే ఉదయ్ మృతి చెందగా, ఆయన ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


ఎర్రుపాలెం : గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఎర్రుపాలెం: మండల కేంద్రంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ పి.వెంకటేష్ తెలిపిన వివరాలు... స్థానిక గురుకులం ఎదురుగా రోడ్డు పక్కన మద్యం మత్తులో ఓ వ్యక్తి(40) అపస్మారక స్థితిలో పడి ఉండగా స్థానికులు 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో ఆయనను మధిర తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. నీలం రంగు జీన్స్, నలుపు రంగు టీ షర్ట్ ధరించిన వ్యక్తి మృతదేహాన్ని మధిర ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచామని, ఆచూకీ తెలిసిన వారు సంప్రదించాలని ఎస్‌ఐ సూచించారు.

రైలు కింద పడి ఒకరు...

మధిర: స్థానిక ఆర్‌సీఎం చర్చి సమీపాన బుధవారం గుర్తు తెలియని వ్యక్తి(60) రైలు నుంచి జారి పడి మృతి చెందాడు. ఆయన దివ్యాంగుడని గుర్తించగా ఇతర వివరాలు తెలియరాలేదు. ఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని మార్చురీకి తరలించినట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ ఎస్.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.

ఆగి ఉన్న బైక్‌ను ఢీకొట్టిన కారు

ఒకరు మృతి, ఇంకొకరికి తీవ్ర గాయాలు

పెనుబల్లి: ఆగి ఉన్న ద్విచక్రవాహనాన్ని అతివేగంగా వచ్చిన కారు ఢీ కొట్టడంతో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పెనుబల్లి మండలం పార్థసారథిపురానికి చెందిన తాపీ మేస్త్రీలు కీసర రాజారావు, కుంజ మహేష్ మంగళవారం రాత్రి వీఎం బంజర్ నుండి ఇంటికి వెళ్లే క్రమాన రాత్రి 9–30 గంటలకు రంగారావు బంజర్ వద్ద ఆగారు. రోడ్డు పక్కన బైక్ నిలిపి కనుమ సందర్భంగా మేకపోతు కొనాలని ఫోన్‌లో మాట్లాడుతున్నారు. ఇదేసమయాన వీఎం బంజర్ నుండి కొత్తగూడెం వైపు వేగంగా వెళ్తున్న కారు వీరి బైక్‌ను ఢీకొట్టి 50 మీటర్ల మేర లాక్కెళ్లింది. దీంతో రాజారావు, మహేష్ ఎగిరి దూరంగా పడగా రాజారావు(34) అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన మహేష్‌కు పెనుబల్లిలో చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. అయితే, ప్రమాదానికి కారణమైన కారు ఆగకుండా వెళ్లిపోవడంతో మృతుడి తమ్ముడు నర్సింహారావు ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై కె.వెంకటేష్ తెలిపారు.


రాజారావు (ఫైల్)

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన లారీ...

కారేపల్లి: రహదారిపై నడిచి వెళ్తున్న వృద్ధురాలిని తప్పించే క్రమాన లారీ డ్రైవర్ ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టాడు. ఖమ్మం – ఇల్లెందు ప్రధాన రహదారిలో కారేపల్లి క్రాస్ వద్ద బుధవారం జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. కారేపల్లి క్రాస్ వద్ద మహిళ రహదారి పైనుంచి వెళ్తుండగా ఖమ్మం నుంచి ఇల్లెందు వైపు వెళ్తున్న లారీ డ్రైవర్ ఆమెను తప్పించే క్రమాన ఖమ్మం వైపు వెళ్తున్న ఇల్లెందు డిపో ఆర్టీసీ బస్సును ఎదురుగా ఢీకొట్టాడు. ఈ సమయాన బస్సు ఒక్కసారిగా కుదుపునకు గురవడంతో అప్రమత్తమైన డ్రైవర్ రోడ్డు కిందకు దించడంతో పెనుప్రమాదం తప్పినట్లయింది. బస్సు అద్దాలు పగిలిపోవడమే కాక ప్రయాణికుల్లో 64 మందికి గాను నలుగురికి గాయాలయ్యాయి. అలాగే, రహదారిపై వెళ్తున్న మహిళ కూడా కింద పడగా గాయపడింది. ఈ సమాచారం అందుకున్న ఎస్సై ఎన్.రాజారాం చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి రాకపోకలను క్రమబద్ధీకరించారు.


ప్రమాదంతో బస్సు దిగిన ప్రయాణికులు

నల్ల తామరను నివారించండి ఇలా...

యాజమాన్య పద్ధతులపై అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు

ఖమ్మంవ్యవసాయం: మిరప రైతులను నల్ల తామర ఆందోళనకు గురిచేస్తోంది. పంట ఆశాజనకంగా ఉన్న సమయాన పురుగు ఆశించి నానాటికీ ఉధృతి పెరుగుతోంది. నల్ల తామర పురుగు మిర్చి ఆకులు, పువ్వులపై చేరి నాశనం చేస్తోంది. ఈ పురుగు ఆకులను గోకి, రసం పీలుస్తుండడంతో ఆకులు మాడిపోవడమే కాక పై భాగం పసుపు రంగులోకి, కింది భాగం ముదురు గోధుమ రంగులోకి మారుతోంది. అలాగే, పువ్వులు సైతం గోధుమరంగులోకి మారి రాలిపోతుండగా పంట దిగుబడి సంఖ్య గణనీయంగా తగ్గే అవకాశం కనిపిస్తోంది. అంతేకాక పూలు కాయలుగా మారినా నల్ల తామర కారణంగా కాయలు గడస బారి, ఇటుక రంగులోకి మారుతున్నాయి. ఈనేపథ్యాన నల్ల తామర పురుగుల నియంత్రణకు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి ఎం.వీ.మధుసూదన్, వైరా కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్ రైతులకు పలు సూచనలు చేశారు.

ఇవీ యాజమాన్య పద్ధతులు

- తామర పురుగులు ఎక్కువగా బెట్ట పరిస్థితులు, అధిక ఉష్ణోగ్రతల సమయాన ఆశించే అవకాశముంటుంది. మొక్కను బెట్టకు గురి చేయకుండా ఎప్పటికప్పుడు నీటి తడులు ఇవ్వాలి. తద్వారా భూమిలో తేమ ఉంటూ పురుగు ఉధృతి తగ్గే ఆవకాశముంది.
- నత్రజని వినియోగం మోతాదుకు మించకుండా సిఫారసు మేరకు వేయాలి. అధికంగా నత్రజని ఎరువులు వేస్తే తెగుళ్ల సమస్య కూడా పెరుగుతుంది.
- ఈ పురుగులకి కలుపు మొక్కలు ఆవాసాలుగా ఉంటాయి. అందుకే పొలం గట్లపై కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తొలగిస్తూ గట్లు, పొలాన్ని శుభ్రంగా ఉంచుకోవాలి.
- రైతులు సామూహికంగా నీలిరంగు జిగురు అట్టలను ఎకరానికి 40–50 వరకు పెట్టుకోవడం ద్వారా పురుగు ఉధృతిని తగ్గించుకోవచ్చు.
- వాతావరణం చల్లగా ఉన్నప్పుడు బెవెరియా బెసియానా లేదా లెకానిసిలియం లెకాని 5 గ్రా.ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- వేప సంబంధిత మందులైన 5% వేపగింజల కషాయం లేదా వేప నూనె పిచికారీ చేసినా ఉధృతిని తగ్గించుకోవచ్చు.
- వాడిన పురుగు మందులు మళ్లీ వాడకుండా మార్చడంతో పాటు సిఫారసు మోతాదులోనే పిచికారీ చేయాలి.
- చివరి అస్త్రంగా సయాంట్రానిలిప్రోల్ 1.2 మి.లీ. లేదా స్పైనోసాడ్ 0.32 మి.లీ. లేదా ఫిప్రోనిల్ 5 ఎస్.సీ 2 మి.లీ. లేదా ఫిప్రోనిల్ 80 డబ్ల్యూజీ 0.2 గ్రా లేదా ఫిప్రోనిల్+ఇమిడాక్లోప్రిడ్ 0.2 గ్రా. లేదా ఎసిటామిప్రిడ్ 0.2 – 0.25 గ్రా. లేదా స్పైనటోరం 1 మి.లీ. లేదా స్పైరోటే ట్రమాట్ 0.8 గ్రా.ను లీటరు నీటిలో కలిపి మందులను మారుస్తూ పిచికారీ చేయాలి.



తల్లాడలో మిరప పైరును పరిశీలిస్తున్న ఉద్యాన, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు (ఇన్‌సెట్) పూతను ఆశించిన నల్ల తామర

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహానికి 'అన్నం' అంత్యక్రియలు


మృతదేహం వద్ద నివాళులరిస్తున్న శ్రీనివాసరావు, ఎస్సై తదితరులు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ వైద్యశాల మార్చురీలో నాలుగు రోజులుగా భద్రపరిచిన మృతదేహం కోసం ఎవరూ రాకపోవడంతో బుధవారం అన్నం ఫౌండేషన్ ఆధ్వర్యాన దహన సంస్కారాలు నిర్వహించారు. బోనకల్ – నాగులవంచ రైల్వేస్టేషన్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి(45) మృతదేహం నాలుగు రోజుల క్రితం లభించగా జీఆర్పీ పోలీసులు మార్చురీలో భద్రపరిచారు. అయితే, మృతుడి తెలియకపోగా ఆయన కోసం ఎవరూ రాకపోవడంతో జీఆర్పీ పోలీసుల సూచనతో అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మృతదేహానికి బల్లేపల్లి వైకుంఠ ధామంలో అంత్యక్రియలు నిర్వహించారు. జీఆర్పీ ఎస్సై పారుపల్లి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

'అబ్బూరి' సర్కిల్‌పై వివాదం

- బోర్డు తొలగించాలని అధికారుల ఆదేశం


ఆత్కూరు క్రాస్ వద్ద పోలీస్ బందోబస్తు

మధిర: మండలంలోని ఆత్కూరు క్రాస్ రోడ్డులో సర్కిల్‌కు మాజీ సర్పంచ్, దివంగత అబ్బూరి రామకృష్ణ పేరు పెట్టడంతో నెలకొన్న వివాదం మళ్లీ తెరపైకి వచ్చింది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ఆత్కూర్ సర్పంచ్‌గా గత గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున రామకృష్ణ సతీమణి సంధ్యారాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత ఆమె బీఆర్ఎస్‌లో చేరగా రెండేళ్ల క్రితం రామకృష్ణ మృతితో ఆయన పేరును ఆత్కూర్ సర్కిల్‌కు పెట్టి బోర్డు ఏర్పాటుచేశారు. అప్పుడు బీఆర్ఎస్ అధికారంలో ఉండడంతో అధికారులెవరూ అభ్యంతరం చెప్పలేదు. ఆ తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నాయకులు ఆత్కూర్ సర్కిల్‌కు అబ్బూరి పేరు తొలగించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లగా విషయం తెలిసి రామకృష్ణ కుటుంబీకులు కోర్టు నుంచి స్టే తీసుకొచ్చారు. ప్రస్తుతం స్టే కాలపరిమితి ముగియడంతో బుధవారం పోలీసు బందోబస్తుతో తహసీల్దార్ రాంబాబు అక్కడ బోర్డును తొలగించేందుకు సిద్ధమయ్యారు. కొంత సమయం ఇస్తే తామే తీసివేస్తామని కుటుంబ సభ్యులు, కొందరు గ్రామస్తులు కోరగా ఉన్నతాధికారుల సూచనల మేరకు ఒకరోజు గడువు ఇచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు.